క్లుప్తంగా

రమేష్‌బాబు సేవలు అభినందనీయం



రమేష్‌బాబును సత్కరిస్తున్న ఆర్టీసీ ఈడీ, ఇతర అధికారులు

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఏపీఎస్ ఆర్టీసీ కడప జోన్ డిప్యూటీ సీటీఎంగా (కార్గో) రమేష్‌బాబు అందించిన సేవలు అభినందనీయమని కడప జోన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ గిడుగు వెంకటేశ్వర రావు తెలిపారు. బుధవారం కడప ఆర్‌ఎం కాన్ఫరెన్స్ హాలులో రమేష్‌బాబును అధికారులు ఘనంగా సత్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కార్గో ద్వారా అధిక ఆదాయం వచ్చేలా కృషి చేయడంతోపాటు జోన్‌లో ఇతర జోన్ల కంటే మెరుగైన స్థానంలో ఉండేలా చర్యలు చేపట్టారని కొనియాడారు. ఈ కార్యక్రమంలో కడప ఆర్‌ఎం గోపాల్‌రెడ్డి, కడప డీఎం డిల్లీశ్వరరావు, డిప్యూటీ సీటీఎం పీఎల్ భాస్కర్, వీఅండ్ఎస్‌ఓ ముజుబుర్ రెహ్మాన్, సూపర్‌వైజర్లు మహేశ్వర్‌రెడ్డి, గోవర్ధన్‌రెడ్డి, ఇతర అధికారులు పాల్గొన్నారు.

ఆశా కార్యకర్తల సదస్సును జయప్రదం చేయాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: నగరంలోని సీపీఐ కార్యాలయంలో గురువారం నిర్వహించనున్న ఆశా కార్యకర్తల సమావేశాన్ని జయప్రదం చేయాలని ఏఐటీయూసీ జిల్లా అధ్యక్షుడు వేణుగోపాల్ పేర్కొన్నారు. బుధవారం నగరంలోని సీపీఐ కార్యాలయంలో నిర్వహించిన జిల్లా ఆశా యూనియన్ కార్యకర్తల సమావేశంలో ఆయన మాట్లాడారు. జిల్లాలోని ఆశా కార్యకర్తలు చాలీ చాలని వేతనాలతో విధులు నిర్వహిస్తున్నారని తెలిపారు. సచివాలయాల్లో ఉదయం నుంచి సాయంత్రం వరకు ఉండాలని సభ సెంటర్లలో సంతకం చేయాలని నిబంధనలు పెట్టడంతో ఒత్తిడికి గురవుతున్నారని తెలిపారు. ఇప్పటికే గ్రామాల్లో గర్భిణులను, బాలింతలను ఆసుపత్రులకు తీసుకెళ్లడంతో పాటు ప్రజల ఆరోగ్యం, పారిశుధ్యంపై అవగాహన కల్పిస్తున్నారని తెలిపారు. రాష్ట్ర ప్రభుత్వం రూ.15 వేల వేతన జీవోను ఇచ్చి జాబ్ కార్డును ఇవ్వాలన్నారు. ఏఐటీయూసీ నాయకులు సరసమ్మ, నిర్మల, ప్రియ దర్శిని తదితరులు పాల్గొన్నారు.

మతోన్మాదానికి వ్యతిరేకంగా పోరాడుదాం



చే గువేరా చిత్రపటానికి పూలమాల వేసి నివాళి అర్పిస్తున్న ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: చేగువేరా స్ఫూర్తితో మతోన్మాదానికి వ్యతిరేకంగా ప్రతి ఒక్కరూ పోరాడాలని సీపీఐ జిల్లా కార్యదర్శి గాలి చంద్ర పిలుపునిచ్చారు. విప్లవకారుడు చేగువేరా జయంతి సందర్భంగా బుధవారం ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ ఆధ్వర్యంలో నగరంలోని సీపీఐ కార్యాలయంలో ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులు అర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పీడిత ప్రజల విముక్తి కోసం చే గువేరా అమెరికన్ సామ్రాజ్యవాదాన్ని ఓడించారన్నారు. ఆయన స్ఫూర్తితో బీజేపీ ప్రభుత్వం ఫాసిస్టు విధానాలను తిప్పికొట్టాలన్నారు. ఈ కార్యక్రమంలో ఏఐఎస్‌ఎఫ్, ఏఐవైఎఫ్ నాయకులు వలరాజు, మైనుద్దీన్, అశోక్ అరుణ్ పాల్గొన్నారు.

డివిజన్ సమస్యల పరిష్కారానికి కృషి

కడప కార్పొరేషన్: నగరంలోని 30వ డివిజన్‌లోని సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నామని ఆ డివిజన్ కార్పొరేటర్ ఎస్‌ఎండీ షఫీ అన్నారు. బుధవారం 'నేను– నా డివిజన్ ప్రజలు' కార్యక్రమంలో భాగంగా ఆయన ఇంటింటికీ వెళ్లి వారి సమస్యలు అడిగి తెలుసుకున్నారు. ప్రజలు తెలిపిన సమస్యలను పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటామని తెలిపారు.

మానవత్వంలో ప్రథమస్థానంలో ఉండాలి

కడప కల్చరల్: మానవతను చాటుకోవడంలో మానవతా స్వచ్ఛంద సేవా సంస్థ నెంబర్ వన్‌గా నిలవాలని కలెక్టర్ ఓఎస్‌డీ రఘునాథ్ అన్నారు. బుధవారం స్థానిక నాగార్జున మహిళా డిగ్రీ కళాశాలలో జరిగిన మానవతా సంస్థ నగర కమిటీ నూతన కార్యవర్గ ప్రమాణ స్వీకారోత్సవానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. నగర కమిటీ అధ్యక్షుడు సుబ్బారెడ్డి తదితరులు తమ హయాంలో సాధించిన పనులను గురించి వివరించారు. సంస్థ వ్యవస్థాపక అధ్యక్షుడు రామచంద్రారెడ్డి మాట్లాడుతూ సంస్థను దేశమంతటా విస్తరింపజేయాలని, సంపూర్ణ సేవాభావం గల సభ్యుల వల్ల ఇది సాధ్యమవుతుందని చెప్పారు. సంస్థ సభ్యులు పాల్గొన్నారు.

నూతన కమిటీ

2023–24 సంవత్సరానికి సంస్థ కడప నగర అధ్యక్షుడిగా పప్పనబోయిన సుబ్బరాయుడు, కార్యదర్శిగా ఆర్.లక్ష్మీనారాయణరెడ్డి, కోశాధికారిగా బి.వీరారెడ్డి, కార్యవర్గ సభ్యులు ప్రమాణ స్వీకారం చేశారు.

రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు



రోడ్డు ప్రమాదాలపై అధికారులతో చర్చిస్తున్న కమిషనర్ ఎస్‌ఎస్ ప్రవీణ్‌చంద్

కడప కార్పొరేషన్: రోడ్డు ప్రమాదాల నియంత్రణకు పటిష్ట చర్యలు చేపట్టాలని మున్సిపల్ కమిషనర్ ఎస్‌ఎస్ ప్రవీణ్‌చంద్ సూచించారు. బుధవారం నగరంలోని బ్లాక్ స్పాట్ జోన్లను డిస్ట్రిక్ట్ రోడ్ సేఫ్టీ కమిటీ సభ్యులతో కలిసి పరిశీలించారు. మహవీర్ సర్కిల్ వద్ద ట్రాఫిక్ సిగ్నల్స్ ఏర్పాటు చేయాలని, డివైడర్‌ను సర్కిల్‌కు దగ్గరగా నిర్మించాలని సూచించారు. పలు చోట్ల సీసీ కెమెరాలను అమర్చేలా చర్యలు తీసుకోవాలన్నారు. రైల్వే అండ్ పాస్ బ్రిడ్జి, వైఎస్సార్ సర్కిల్ వద్ద సైన్ బోర్డులను ఏర్పాటు చేయాలన్నారు. డివైడర్ నుంచి సర్కిల్ వరకూ బారికేడ్లు ఏర్పాటు చేయాలన్నారు. పాలకొండలకు వెళ్లే జంక్షన్ నందు నాలుగు వైపులా రంబుల్ స్ట్రిప్స్ ఏర్పాటు చేయాలన్నారు. డీటీసీ సర్కిల్ వద్ద హైమాస్ లైట్లను ఏర్పాటు చేయాలని, లలితాంబ గుడి వద్ద విస్తరణ చేయాలని ఆదేశించారు. రోడ్లపై హెచ్చరిక బోర్డులను ఏర్పాటు చేయాలని, అధికారులకు సూచించారు. కడప–తిరుపతి రోడ్డులో అమీర్ పెట్రోల్ బంకు వద్ద ప్రమాదాలు ఎక్కువగా జరుగుతున్నాయని, ఇక్కడ స్పీడ్ లిమిట్ బోర్డులను చేయాలన్నారు. డీఎస్పీ ఎస్‌ఎండీ షరీఫ్, తహసీల్దార్ శివరామిరెడ్డి, ఏసీపీ నాగేంద్ర, ఆర్అండ్‌బి అధికారులు, ట్రాఫిక్ పోలీసులు పాల్గొన్నారు.

విద్యారంగంలో దేశంలోనే ఏపీ అగ్రగామి



సీఎం వైఎస్ జగన్ చిత్రపటానికి క్షీరాభిషేకం చేస్తున్న సాయిదత్త, కార్పొరేటర్ సూర్యనారాయణరావు

కడప కార్పొరేషన్ : విద్యారంగంలో దేశంలోనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్రం అగ్రగామిగా ఉందని వైఎస్సార్ స్టూడెంట్ యూనియన్ జిల్లా అధ్యక్షుడు సాయిదత్త, 25వ డివిజన్ కార్పొరేటర్ సూర్యనారాయణరావు అన్నారు. బుధవారం స్థానిక మున్సిపల్ బాలుర ఉర్దూ ఉన్నత పాఠశాలలో విద్యాకానుక అందించిన ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి చిత్రపటానికి క్షీరాభిషేకం నిర్వహించారు. విద్యార్థులు థ్యాంక్యూ జగన్ మామయ్య అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ వైఎస్సార్‌సీపీ ప్రభుత్వం ఏర్పడిన తర్వాత విద్యా వ్యవస్థలో సమూల మార్పులు తీసుకొచ్చారని తెలిపారు. పాఠశాలలు తెరిచిన తొలిరోజే పాఠ్యపుస్తకాలు, యూనిఫారం, షూ, బెల్ట్, టై వంటివి అందజేయడం దేశంలో మరెక్కడా జరగలేదన్నారు. కార్యక్రమంలో వైఎస్సార్‌సీపీ నాయకులు సింధు, అర్జున్, లక్ష్మీనారాయణ, అనిల్, విద్యార్థి నాయకులు శివ, ప్రవీణ్, సందీప్, కార్తీక్ పాల్గొన్నారు.

నిరుద్యోగులకు ఉపాధి కల్పించడమే ధ్యేయం



నిరుద్యోగులకు సూచనలిస్తున్న జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్

కడప కోటిరెడ్డిసర్కిల్ : నిరుద్యోగ యువత తొలిగా వచ్చిన అవకాశాలను సద్వినియోగంచేసుకోవాలని జిల్లా ఉపాధి కల్పనాధికారి సురేష్‌కుమార్ తెలిపారు. బుధవారం కలెక్టరేట్‌లోని జిల్లా ఉపాధి కల్పనాధికారి కార్యాలయంలో జాబ్‌మేళా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం నిరుద్యోగులకు ఉపాధి కల్పించాలన్న ఉద్దేశ్యంతో పెద్ద పెద్ద కంపెనీలతో అనుసంధానమై జాబ్‌మేళాలను నిర్వహిస్తోందన్నారు. మొదటి చిన్న ఉద్యోగమైనా చేరి అంచెలంచెలుగా ఉన్నత శిఖరాలను చేరుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జేఈఓ డోనప్ప, పాపులర్ షూ మార్ట్, పే టీఎం ప్రతినిధులు పాల్గొన్నారు.

పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలి



చిన్నారులు, తల్లులతో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్వాడీ వర్కర్లు

కడప కోటిరెడ్డిసర్కిల్ : అంగన్వాడీ కేంద్రాల ద్వారా బాలింతలు, చిన్నారులు, గర్భిణులకు అందిస్తున్న పౌష్టికాహారాన్ని సద్వినియోగం చేసుకోవాలని సూపర్‌వైజర్ రెడ్డెమ్మ తెలిపారు. బుధవారం బాలల భవితకు భాగస్వామ్యంలో భాగంగా నాగరాజుపేట, ఎర్రముక్కపల్లె సెక్టార్‌లోని అంగన్వాడీ కేంద్రాల తల్లిదండ్రుల ఆధ్వర్యంలో జనభాగిదారి కార్యక్రమంలో భాగంగా ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ అంగన్వాడీ కేంద్రాలలో ప్రీ స్కూలు విద్య, ఆటపాటలతో కూడిన విద్యను అందిస్తున్నామన్నారు. మూడు నుంచి ఐదేళ్ల లోపు పిల్లలను అంగన్వాడీ కేంద్రాల్లోనే చదువుకునేలా, కాన్వెంట్ల కంటే మిన్నగా అన్ని రకాల సిలబస్‌లను పీపీ1, పీపీ2 ద్వారా ఇంగ్లీషు మీడియంలో బోధన చేస్తున్నామన్నారు. అలాగే పిల్లలకు పౌష్టికాహారాన్ని కూడా అందిస్తున్నామని, తల్లిదండ్రులు దీనిని సద్వినియోగం చేసుకోవాలన్నారు. డబ్ల్యూఎంఎస్‌కే ప్రసన్న, అంగన్వాడీ వర్కర్లు గీత, లక్ష్మి, వినీలా గ్లోరి, సరోజ, మంజుల, మహేశ్వరి, తల్లిదండ్రులు, చిన్నారులు పాల్గొన్నారు.

'బ్రౌన్' చిత్రాన్ని లోకానికి అందించిన 'మైనంపాటి'



మైనంపాటి చిత్రపటానికి నివాళులర్పిస్తున్న బ్రౌన్ కేంద్రం ప్రతినిధులు

కడప కల్చరల్ : తెలుగు భాషోద్ధారకుడు సీపీ బ్రౌన్ చిత్రాన్ని గీసి ఆయనను తెలుగు లోకానికి అందించిన ఘనత చిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రమణ్యందేనని యోగి వేమన విశ్వవిద్యాలయం ఉపకులపతి చింతా సుధాకర్ తెలిపారు. వైవీయూ ఆధ్వర్యంలోని సీపీ బ్రౌన్ భాషా పరిశోధన కేంద్రంలో బుధవారం సీపీ బ్రౌన్ ఊహా చిత్రకారుడు మైనంపాటి వెంకట సుబ్రమణ్యం 13వ వర్ధంతిని నిర్వహించారు. తొలుత ఉప కులపతి సుధాకర్ కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య, బ్రౌన్ కేంద్రం సంచాలకులు ఆచార్య మూల మల్లికార్జునరెడ్డి, సిబ్బందితో కలిసి మైనంపాటి చిత్రపటానికి పూలమాల అలంకరించి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా వీసీ చింతా సుధాకర్ మాట్లాడుతూ మైనంపాటి బహుముఖ ప్రజ్ఞాశాలి అని, సంగీత సాహిత్యాలు, చిత్రలేఖనం, నాట్యం తదితర కళల్లో మేటిగా నిలిచారన్నారు. కుల సచివులు ఆచార్య వైపీ వెంకట సుబ్బయ్య , అధికారభాషా సంఘ సభ్యులు తవ్వా వెంకటయ్య మాట్లాడారు. బ్రౌన్ కేంద్రం సహాయ పరిశోధకులు డాక్టర్ చింతకుంట శివారెడ్డి, డాక్టర్ భూతపురి గోపాలకృష్ణశాస్త్రి, రచయిత కొత్తపల్లి రామాంజనేయులు కూడా మాట్లాడారు. కార్యక్రమంలో గ్రంథ పాలకులు రమేష్‌రావు తదితరులు పాల్గొన్నారు.

వర్షం కోసం చిన్నారుల ప్రార్థనలు

కడప కల్చరల్: వర్షాలు కురవాలని కడప నగరానికి చెందిన కొందరు చిన్నారులు దైవాన్ని ప్రార్థించారు. మంగళవారం కడప నగరంలోని మజ్జిద్ బుర్హానుద్దీన్ మదరసాలో పిల్లలు ఈ మేరకు ప్రార్థనలు నిర్వహించారు. ఈ వేసవిలో అధిక ఉష్ణోగ్రతలు నమోదవుతున్నాయని, క్రమంగా ఇది ప్రమాదకరంగా మారుతోందని ఆందోళన వ్యక్తం చేశారు. మసీదు నిర్వాహకులు హఫీజ్ రియాజ్ ఈ సందర్భంగా మాట్లాడుతూ వర్షాలు విస్తృతంగా కురవాలని, అల్లాహ్ ప్రజలపై కరుణ చూపాలని, అన్ని వర్గాల వారు సుఖ సంతోషాలతో ఉండాలని చిన్నారులచే ప్రార్థనలు చేయించారు. ప్రజలు కూడా వర్షం కోసం ప్రత్యేకంగా ప్రార్థించాలని కోరారు. జేకే పఠాన్ ఖాదర్‌బాష తదితరులు పాలొన్నారు.

నేడు గొందిపల్లెలో గడప గడపకు మన ప్రభుత్వం

పెండ్లిమర్రి : మండలంలోని గొందిపల్లె గ్రామ సచివాలయం పరిధిలోని గొందిపల్లె, బాలయ్యగారి పల్లె, రామచంద్రాపురం, ఇందిరానగర్ గ్రామాల్లో గురువారం మధ్యాహ్నం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం ఉంటుందని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ చంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎమ్మెల్యే పి.రవీంద్రనాథ్‌రెడ్డి పాల్గొంటారని పేర్కొన్నారు.

18న సదస్సు

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: కేంద్ర ప్రభుత్వ విద్యుత్ సంస్కరణలపై ఈ నెల 18న సదస్సు నిర్వహించనున్నట్లు సీపీఐ నగర కార్యదర్శి రామ్మోహన్ పేర్కొన్నారు. ఈ సదస్సును జయప్రదం చేయాలని కోరుతూ బుధవారం నగరంలో ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ 2000 సంవత్సరంలో విద్యుత్ చార్జీల పెంపుపై ప్రజలు పెద్ద ఎత్తున పోరాటాలు చేయడంతో ప్రభుత్వం వెనక్కి తగ్గిందన్నారు. సీపీఎం నాయకులు మహబూబ్ తార, ఎంఆర్ నాయక్ తదితరులు పాల్గొన్నారు.

టైలరింగ్‌లో ఉచిత శిక్షణ

కడప కోటిరెడ్డిసర్కిల్: కడప నగర శివార్లలోని కెనరా బ్యాంకు గ్రామీణ స్వయం ఉపాధి శిక్షణ సంస్థలో ఈనెల 19 నుంచి గ్రామీణ ప్రాంతాలకు చెందిన నిరుద్యోగ మహిళలకు టైలరింగ్‌లో ఉచిత శిక్షణ ఇవ్వనున్నట్లు ఆ సంస్థ డైరెక్టర్ నారాయణరెడ్డి తెలిపారు.18 నుంచి 45 ఏళ్ల లోపు వారు అర్హులన్నారు. 30 రోజుల పాటు శిక్షణ కొనసాగుతుందని వివరించారు. అలాగే దూర ప్రాంతాల నుంచి వచ్చే వారికి ఉచిత వసతి, భోజన సౌకర్యం కల్పిస్తామన్నారు. ఈ అవకాశాన్ని వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు చెందిన మహిళలు సద్వినియోగం చేసుకోవాలని ఆయన కోరారు.

వైభవంగా విగ్రహ ప్రతిష్ట మహోత్సవం



నగదును అందజేస్తున్న నరేన్ రామాంజుల రెడ్డి

కమలాపురం : మండల పరిధిలోని కొండాయపల్లెలో నూతనంగా నిర్మించిన సీతారామలక్ష్మణ హనుమత్సమేత దేవస్థానంలో విగ్రహ ప్రతిష్ట మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ నెల 12వ తేదీ నుంచి జరుగుతున్న ప్రతిష్ట మహోత్సవాల్లో భాగంగా చివరి రోజు బుధవారం ఆలయ కమిటీ సభ్యులు, గ్రామ ప్రజల ఆధ్వర్యంలో ప్రముఖ వేద పండితుల మంత్రోచ్చారణల మధ్య ప్రత్యేక పూజలు నిర్వహించారు. అనంతరం బండలాగుడు పోటీలు నిర్వహించారు. విజేతలకు ప్రథమ బహుమతి ఏపీఎస్ ఆర్టీసీ చైర్మన్ దుగ్గాయపల్లె మల్లికార్జునరెడ్డి విజేతలకు నగదు బహుమతులు అందజేశారు.

నరేన్ రెడ్డి విరాళం.. ఆలయ ప్రతిష్ట మహోత్సవాలకు హాజరైన సీకేదిన్నె జడ్పీటీసీ నరేన్ రామాంజులరెడ్డికి నిర్వాహకులు మహేశ్వర్‌రెడ్డి, మైసూరారెడ్డిలు పూలమాలతో సత్కరించారు. ప్రతిష్ట మహోత్సవాల్లో అన్నదానానికి వినియోగించాలని రూ.30వేల నగదును నిర్వాహకులకు నరేన్ అందజేశారు. కార్యక్రమంలో వైఎస్సార్ సీపీ నాయకులు ఉత్తమారెడ్డి, సుమిత్రా రాజశేఖర్‌రెడ్డి, ఎస్సీ పుల్లారెడ్డి, ఆర్‌వీఎస్‌ఆర్, కొండారెడ్డి పుత్తా మధు, మహమ్మద్ సాదిక్ పాల్గొన్నారు.

చింతకొమ్మదిన్నె : జగనన్న విద్యా కానుక విద్యార్థులకు వరం అని సీకేదిన్నె జడ్పీటీసీ పి.నరేన్ రామాంజులురెడ్డి తెలిపారు. బుధవారం మండలంలోని జె కొత్తపల్లె పాఠశాలలో జగనన్న విద్యాకానుక కిట్లను పంపిణీ చేసి ఆయన మాట్లాడారు. మండలంలో 4414 మంది విద్యార్థులకు నాలుగో విడత జగనన్న విద్యా కానుక కిట్లను పంపిణీ చేసినట్లు ఆయన తెలిపారు. మండల కన్వీనర్ గూడ ప్రభాకర్‌రెడ్డి, కళాయాదవ్ పాల్గొన్నారు.

పరిశోధన ప్రాజెక్టులపై ప్రత్యేక దృష్టి

వైవీయూ వీసీ చింతా సుధాకర్



పరిశోధనలపై మార్గనిర్దేశం చేస్తున్న వైవీయూ వీసీ ఆచార్య చింతా సుధాకర్

వైవీయూ : పరిశోధన ప్రాజెక్టులు పొందడానికి ఉన్న అన్ని అవకాశాలను వినియోగించుకునేలా సీనియర్ ఆచార్యులు కృషి చేయాలని వైవీయూ వైస్ చాన్స్‌లర్ ఆచార్య చింతా సుధాకర్ సూచించారు. బుధవారం వైవీయూలోని ఫిజిక్స్, కెమిస్ట్రీ, జియాలజీ, మెటీరియల్ సైన్స్ అండ్ నానోటెక్నాలజీ విభాగాలకు సంబంధించిన సమగ్ర సమచారంతో రూపొందించిన వెబ్‌సైట్‌ను వీసీ ప్రారంభించారు. ఈ సందర్భంగా వీసీ మాట్లాడుతూ పరిశోధనల పరంగా ఉన్నతస్థితిలో ఉన్న ఈ శాఖల్లో మరిన్ని ప్రాజెక్టులు వచ్చేలా కృషి చేయాలని, అవసరమైతే రీసెర్చ్ స్కాలర్లు, భావి పరిశోధకుల కోసం పరిశోధన అవకాశాలను సృష్టించాలని కోరారు. రిజిస్ట్రార్ ఆచార్య వై.పి.వెంకటసుబ్బయ్య మాట్లాడుతూ వైవీయూ వెబ్‌సైట్‌లో సమగ్ర సమాచారం లభించేలా తీర్చిదిద్దడం అభినందనీయమన్నారు. వెబ్‌సైట్ విశ్వవిద్యాలయానికి దర్పణంలా ఉండాలని సూచించారు. కార్యక్రమంలో ప్రిన్సిపాల్ ఆచార్య ఎస్. రఘునాథరెడ్డి, డీడీఈ సంచాలకులు ఆచార్య కె.కృష్ణారెడ్డి, ఆచార్య ఎన్.సి. గంగిరెడ్డి, ఐటీ సెల్ డైరెక్టర్ ఆచార్య ఎం.వి. శంకర్, ఆచార్య రఘుబాబు, డా. విజయ్‌కుమార్‌నాయుడు ఐక్యూఏసీ సెల్ డైరెక్టర్ సుబ్రమణ్యంశర్మ పాల్గొన్నారు.

వీసీని కలిసిన కేవీఆర్‌ఎస్‌ఎస్ గ్రూప్ సీఈఓ..

వీసీ ఆచార్య చింతా సుధాకర్, రిజిస్ట్రార్ ఆచార్య వై.పి. వెంకటసుబ్బయ్యలను కేవీఆర్‌ఎస్‌ఎస్ సాఫ్ట్‌వేర్ సొల్యూషన్స్ గ్రూప్ సీఈఓ కంబం వెంకటేశ్వర్లు బుధవారం మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా వారి మధ్య ప్రామాణిక వెబ్‌సైట్‌ల గురించి, వాటి ఆధునీకరణ గురించి, విశ్వవిద్యాలయానికి అందించే సాంకేతిక సహకారం గురించి చర్చించారు.

విజ్ఞాన, వినోదాలకు వేదికలు శిక్షణ శిబిరాలు

కలెక్టర్ విజయరామరాజు



మాట్లాడుతున్న కలెక్టర్ విజయరామరాజు

కడప కార్పొరేషన్ : విద్యార్థుల్లో విజ్ఞాన, వినోద, నైపుణ్యాలను పెంపొందించేందుకు వేసవి శిక్షణ శిబిరాలు ఎంతో ఉపయోగపడుతున్నాయని కలెక్టర్ విజయరామరాజు అన్నారు. బుధవారం సాయంత్రం కడప మున్సిపల్ కార్పొరేషన్ గాంధీనగర్ ఉన్నత పాఠశాలలో వేసవి శిక్షణ శిబిరాల ముగింపు కార్యక్రమం కన్నుల పండువగా జరిగింది. కడప నగరపాలక సంస్థ, ఆర్తి ఫౌండేషన్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించిన ఈ కార్యక్రమానికి కలెక్టర్ విజయరామరాజు దంపతులు, మున్సిపల్ కమిషనర్ ఎస్‌ఎస్ ప్రవీణ్‌చంద్ ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా కలెక్టర్ మాట్లాడుతూ పాఠశాలల్లో నిరంతరం పాఠ్యపుస్తకాలతో కుస్తీలు పడే విద్యార్థులకు ఏడాదికి ఒక్కసారి వచ్చే వేసవి సెలవులు వారి ఆటపాటలకు, ఆట విడుపునకు చక్కటి వేదికలవుతాయన్నారు. వేసవి ఎండల్లో పిల్లలు సమయాన్ని వృథా చేయకుండా నగరపాలక సంస్థ వారు ప్రారంభించిన వేసవి శిక్షణ శిబిరాల్లో వారికి నచ్చిన పలు అంశాల్లో ఆయా విభాగాల్లో నిష్ణాతులైన ట్రైనర్లతో నైపుణ్య శిక్షణ అందివ్వడం ద్వారా విద్యార్థులు వినోదం, ఆనందంతో కూడిన విజ్ఞానాన్ని, నైపుణ్యాన్ని సొంతం చేసుకున్నారన్నారు. ఈ వేసవి శిక్షణ శిబిరాల నిర్వహణలో ఆర్తి ఫౌండేషన్ వారు అందించిన సహకారం అభినందనీయమన్నారు. కమిషనర్ ప్రవీణ్‌చంద్ మాట్లాడుతూ ఈ వేసవి సెలవుల్లో నిర్వహించిన శిక్షణా శిబిరాలకు విద్యార్థులు, వారి తల్లిదండ్రుల నుంచి అనూహ్య స్పందన లభించిందన్నారు. ఇకపై ప్రతి ఏటా ఇలాంటి కార్యక్రమాలతో విద్యార్థులకు ఆటవిడుపుతోపాటు వారిలో ఉన్న కళాత్మక నైపుణ్యాలను వెలికితీసి, వారి అభివృద్ధికి బాటలు వేస్తామన్నారు. ఆర్తి ఇంగ్లీషు మీడియం స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన పలు సాంస్కృతిక కార్యక్రమాలు అలరించాయి. వేసవి శిక్షణా శిబిరాల్లో విద్యార్థులు నేర్చుకొని తయారు చేసిన పలు పెయింటింగ్స్, డ్రాయింగ్స్, అల్లికలు వంటి ప్రదర్శనలు ఆకట్టుకున్నాయి. అనంతరం శిక్షణ పూర్తి చేసుకున్న విద్యార్థులకు సర్టిఫికెట్లు, సాంస్కృతిక ప్రదర్శనలు చేసిన విద్యార్థులకు జ్ఞాపికలు, ప్రశంసా పత్రాలను అందజేశారు. తహసీల్దార్ శివరామిరెడ్డి, ఎస్ఎస్ఏ పీఓ ప్రభాకర్‌రెడ్డి, ఆర్తి ఫౌండేషన్ అధ్యక్షురాలు పి. సంధ్య, ప్రతినిధులు అరుణారెడ్డి, దుర్గా కుమారి, భాగ్యమ్మ, సునీల్ కాంత్, సినోరీటా, వలంటీర్లు, విద్యార్థులు, వారి తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

రక్తదానంపై అవగాహన అవసరం



రక్తదాతను అభినందిస్తున్న స్టెప్ సీఈఓ సాయిగ్రేస్



ర్యాలీ నిర్వహిస్తున్న ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ కేడెట్స్

వైవీయూ : రక్తదానంపై యువత అవగాహన పెంపొందించుకోవాలని కడప ప్రభుత్వ పురుషుల కళాశాల ప్రిన్సిపాల్ జి. రవీంద్రనాథ్ సూచించారు. బుధవారం కడప నగరంలోని ఆర్ట్స్ కళాశాల ఎన్‌సీసీ యూనిట్ ఆధ్వర్యంలో ప్రపంచ రక్తదాతల దినోత్సవం సందర్భంగా అవగాహన ర్యాలీ నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ మాట్లాడుతూ అర్హత కలిగిన వారందరూ రక్తదానం చేసి ప్రాణదాతలు కావాలని సూచించారు. ఎన్‌సీసీ అధికారి ఆర్. నీలయ్య మాట్లాడుతూ 18 ఏళ్ల పూర్తయి, ఆరోగ్యంగా ఉన్న ప్రతి ఒక్కరూ రక్తదానం చేయవచ్చని సూచించారు. ఎన్‌సీసీ అధికారి లెఫ్టినెంట్ మహేష్, ఎన్‌సీసీ కేడెట్స్ పాల్గొన్నారు.

రక్తదానం చేసిన ఎన్‌వైకే జిల్లా అధికారి

ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని నెహ్రూ యువకేంద్రం జిల్లా అధికారి కె. మణికంఠ రక్తదానం చేశారు. బుధవారం కడప నగరంలోని రెడ్‌క్రాస్ సొసైటీలో ఆయన 13వసారి రక్తదానం చేశారు. అనంతరం పలువురు ఎన్‌వైకే వలంటీర్లు రక్తదానం చేశారు.

యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలి

యువత రక్తదానం చేసేందుకు ముందుకు రావాలని హ్యాండ్స్ ఫర్ యూ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు పట్టుపోగుల సుబ్బారావు, బృహద బ్లడ్ బ్యాంకు నిర్వాహకులు డాక్టర్ రాజేశ్వరి సూచించారు. బుధవారం ప్రపంచ రక్తదాతల దినోత్సవం పురస్కరించుకుని కడప నగరంలోని శ్రీహరి డిగ్రీ కళాశాలలో విద్యార్థులకు రక్తదానంపై అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఆరోగ్యంగా ఉండి, 18 ఏళ్లు దాటిన వారందరూ రక్తదానం చేసేందుకు అర్హులన్నారు. అనంతరం రక్తదాన ఉద్యమం చేస్తున్న హ్యాండ్స్ ఫర్ యు వ్యవస్థాపకుడు పట్టుపోగుల సుబ్బారావును సన్మానించారు.

రక్తదానం చేసి ప్రాణదాతలుగా నిలవాలి

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆరోగ్యవంతుడైన ప్రతి వ్యక్తి రక్తదానం చేసి ప్రాణదాతగా నిలవాలని స్టెప్ సీఈఓ సాయిగ్రేస్, అభ్యుదయ సేవా సొసైటీ ప్రతినిధి పొన్నాల శివయ్య పిలుపునిచ్చారు. ప్రపంచ రక్తదాతల దినోత్సవాన్ని పురస్కరించుకుని బుధవారం సొసైటీ ఆధ్వర్యంలో రక్తదానం చేశారు. అభ్యుదయ సేవా సొసైటీ సభ్యులు తిమ్మారెడ్డి, రాజేష్, నాగేంద్ర, శ్రీను, రాజశేఖర్ పాల్గొన్నారు.

ఖాళీ పోస్టులను భర్తీ చేయాలి

కడప ఎడ్యుకేషన్: బదిలీల అనంతరం జిల్లాలోని పాఠశాల్లో మిగిలిన పోస్టులను వెంటనే భర్తీ చేయాలని ఆంధ్రప్రదేశ్ ఉపాధ్యాయ సంగం జిల్లా అధ్యక్షుడు పోగుల వెంకట్రామిరెడ్డి కోరారు. ఈ విషయమై బుధవారం ఆపస్ సంఘ ప్రతినిధులు డీఈఓ రాఘవరెడ్డిని కలిసి వినతిపత్రమిచ్చారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ చాలా పాఠశాలల్లో ఉపాధ్యాయులు బదిలీ కావడంతో పోస్టులు ఖాళీ అయ్యాయన్నారు. దీంతో విద్యార్థులు ఇబ్బందులు పడుతున్నారన్నారు. వెంటనే స్పందించి పోస్టులను భర్తీ చేయాలన్నారు. ఆపస్ జిల్లా ప్రధాన కార్యదర్శి చెన్నయ్య, రాష్ట్రకార్యదర్శి సుబ్బరాయుడు, జిల్లా మీడియా ఇన్‌చార్జ్ బాలకృష్ణుడు, గౌరవాధ్యక్షురాలు బాలనాయుడు, ఉపాధ్యక్షులు సుధాకర్‌రెడ్డి, శ్రీనివాసులు, జిల్లాశాఖ కార్యదర్శులు పాల్గొన్నారు.

పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలి

కడప వైఎస్‌ఆర్ సర్కిల్: పోస్టల్ ఉద్యోగుల సమస్యలను కేంద్ర ప్రభుత్వం పరిష్కరించాలని అఖిల భారత ఉద్యోగుల సంఘం యూనియన్ జిల్లా అధ్యక్షుడు గురువారెడ్డి పేర్కొన్నారు. బుధవారం పోస్టల్ ఉద్యోగుల సమస్యలను పరిష్కరించాలని కోరుతూ పోస్టల్ ప్రధాన కార్యాలయం ఎదుట నల్ల బ్యాడ్జీలను ధరించి నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోస్ట్‌మెన్ ఖాళీ పోస్టులలో దీర్ఘకాలిక సెలవుపై వెళ్లిన వారి స్థానంలో ప్రత్యామ్నాయ సిబ్బందిని ఏర్పాటు చేయాలన్నారు. ఈ సమస్యలను వెంటనే పరిష్కరించాలని కోరారు. ఈ కార్యక్రమంలో యూనియన్ నాయకులు సోమ శంకర్, మహబూబ్ భాష, రమణ రవి తదితరులు పాల్గొన్నారు.

బస్టాండు కిటకిట

కడప కోటిరెడ్డిసర్కిల్ : ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర రోడ్డు రవాణా సంస్థ మంత్లీ, క్వార్టర్లీ, ఇయర్లీ రాయితీ పాసులు, దివ్యాంగులకు ఉచిత పాసుల జారీ చేస్తుండడంతో బస్టాండు ఆవరణం కిటకిటలాడుతోంది. ఉదయం 9 నుంచి విద్యార్థులు క్యూలో నిలబడి పాసులను పొందుతున్నారు. వైఎస్సార్, అన్నమయ్య జిల్లాలకు సంబంధించి కడపలోనే పాసులు జారీ చేస్తుండడంతో ఉదయం నుంచి సాయంత్రం వరకు బస్టాండు ఆవరణం సందడిగా కనిపిస్తోంది. మరోవైపు రెండు జిల్లాలకు సంబంధించి జర్నలిస్టులకు కూడా బస్సు పాసులు జారీ చేస్తున్నారు. ఈ సందర్భంగా సంబంధిత కాంట్రాక్టర్ గౌస్‌బాషా మాట్లాడుతూ త్వరితగతిన పాసుల జారీకి చర్యలు తీసుకుంటున్నామని, అందుకు ప్రతి ఒక్కరూ తమ వంతుగా సహకారాన్ని అందించాలని కోరారు.


ఏపీ ఈఏపీసెట్‌లో నారాయణ విద్యార్థుల ప్రతిభ



ప్రతిభ చూపిన విద్యార్థులతో కళాశాల యాజమాన్యం

కడప ఎడ్యుకేషన్: జేఎన్‌టీయూ ప్రకటించిన ఏపీ ఈఏపీసెట్ ఫలితాల్లో కడప నారాయణ జూనియర్ కళాశాల విద్యార్థులు ర్యాంకుల పంట పండించారు. ఇందులో భాగంగా అగ్రికల్చర్ అండ్ ఫార్మసీలో భార్గవి 66వ ర్యాంకు, బృహతి 115వ ర్యాంకు, హరిత 411వ ర్యాంకు, భవిక 1070వ రాష్ట్రస్థాయి ర్యాంకులను సాధించారు. అలాగే ఇంజనీరింగ్ విభాగంలో దివ్య 930వ ర్యాంకు, సాయి గణేష్‌శర్మ 941వ ర్యాంకు, చరిత 1181వ ర్యాంకు, శివధనుష్ 1190వ ర్యాంకు, హితేస్‌రెడ్డి 1222 ర్యాంకు, వంశీకృష్ణారెడ్డి 1324 ర్యాంకు, శ్రీతేజేష్ 1352 ర్యాంకు, వాగ్దేవిరెడ్డి 1429 ర్యాంకు, భానుప్రకాష్‌రెడ్డి 1458 ర్యాంకు సాధించారు. ఉత్తమ ర్యాంకులు సాధించిన విద్యార్థులను కళాశాల డీజీఎం రామమోహన్‌రెడ్డి, డీన్ చంద్రకిషోర్‌రెడ్డి, శ్రీనివాసులరెడ్డి, ఏజీఎంలు వెంకటరామిరెడ్డి, చెన్నక్రిష్ణారెడ్డి, ప్రతాప్‌రెడ్డి, నాగేంద్రరెడ్డి, ప్రిన్సిపాల్స్ వెంకటస్వామి, మురళీమోహన్, రాఘవరెడ్డి, సుధాకర్‌రెడ్డి అభినందించారు.

ఘనంగా గంధ మహోత్సవం



కడప కల్చరల్ : కడప నగరం వన్‌టౌన్ సర్కిల్ వద్దగల హజరత్ ఖ్వాజా సయ్యద్‌షా మహమ్మద్ షహబుద్దీన్ (మొహర్ అలీషా) దర్గా గంధం ఉత్సవం బుధవారం ఘనంగా నిర్వహించారు. దర్గా పీఠాధిపతి హజరత్ సయ్యద్‌షా మహమ్మద్ జమాలుల్లాబాష హుసేనీ సాహెబ్ ఈ సందర్భంగా తమ ఇంటి నుంచి గంధం కలశాన్ని స్వయంగా తీసుకుని మేళతాళాల మధ్య ఊరేగింపుగా దర్గా వద్దకు చేర్చారు. అనంతరం దర్గాలోని గురువుల మజార్ వద్ద సమర్పించి ఫాతెహా చేసి ప్రసాదాన్ని పంచి పెట్టారు. పలువురు ముస్లిం ప్రముఖులు, భక్తులు పాల్గొన్నారు.